

ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: టిపిఆర్ఎల్ శిక్షణ తరగతుల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు పాఠశాలల్లో కచ్చితంగా అమలు పరచాలని సమగ్ర శిక్ష మానిటరింగ్ ఆఫీసర్ కె భాస్కర్ రావు చెప్పారు. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయులకు బేస్ లైన్ శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు నేర్పించాల్సిన విద్యాబోధనలో ఉపాధ్యాయులు మెలకువలు నేర్చుకోవాలన్నారు. ఉపాధ్యాయులకు పలు సలహాలు సూచనలు చేస్తూ అవగాహన కల్పించారు. అనంతరం బాలికల ఆశ్రమ పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న అదనపు భవనాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జి.నాగేంద్ర, జి.సింహాచలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


శిక్షణ ఇస్తున్న భాస్కర్

ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలి

-గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి ఉపసంచాలకులు రజని - విద్యార్థి మృతిపై విచారణ


మాట్లాడుతున్న రజని

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: ఉపాధ్యాయులు బాధ్యత యుతంగా వ్యవహరించాలని గిరిజన సంక్షేమ శాఖ ఇన్చార్జి ఉప సంచాలకులు ఎల్.రజని స్పష్టం చేశారు. అరకులోయ గురుకుల బాలుర (పివిటిజి) ఆశ్రమ ఉన్నత పాఠశాలను సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. గిరిజన విద్యార్థి బిద్యాయిని ప్రవీణ్ కుమార్ మృతిపై గురుకుల పాఠశాలలో విచారణ చేపట్టారు. విద్యార్థులతో మాట్లాడి గురుకుల పాఠశాలలో జరిగిన సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలు, విద్యా చట్టాలు మేరకు ఉపాధ్యాయులు బాధ్యతగా ఉండాలని చెప్పారు. నిబంధనలను అతిక్రమించే ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులతో ఉపాధ్యాయులు స్నేహపూర్వకంగా ఉండాలన్నారు. నాణ్యమైన విద్యను అందించి ఉన్నతంగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. గుణాత్మక విద్యను అందించడంతో పాటు మంచి విలువలను విద్యార్థులకు నేర్పించాలని సూచించారు. భోజన మెనూ సక్రమంగా అమలు చేయాలని పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. శుభ్రంగా ఉంచడంతో వ్యాధులు ప్రబలవని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏజెన్సీలో గంజాయి సాగు నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డి పీఎస్ఎన్ మూర్తి, ఏటి డబ్ల్యు మల్లికార్జున, గురుకుల కళాశాల కన్వీనర్ ప్రిన్సిపాల్ పారయ్య, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


అధికారులను అడిగి తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్

హైవే రోడ్డు పనులతో నష్టంపై..
సబ్ కలెక్టర్ ఆరా

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని నేషనల్ హైవే రోడ్డు పనులతో కాఫీ తోటలు, జిరాయితి, సాగు భూమి, ఇల్లు, దుఖాణాలు తదితర నష్టంపై జిల్లా సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ ఆరా తీశారు. సోమవారం ఎగువసభ, అనంతగిరి, టోకురు పంచాయతీల్లో సబ్ కలెక్టర్ పర్యటించారు. కాపీ తోటలు, భూములు, దుఖణాలు, ఇల్లు వంటి వాటిపై నష్టాలను రైతులు, లబ్ధిదారులతో. మాట్లాడారు. వీటికి సంబంధించి ప్రభుత్వం మంజూరు చేసిన. పత్రాలు ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డిటి రామ్మూర్తి, ఇన్‌చార్జి తహసిల్దార్ మాణిక్యం, ఆర్ఐ శంకరరావు పాల్గొన్నారు.


ప్రజల నుండి అర్జీలను స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్

పబ్లిక్ గ్రీవెన్స్‌కు 75 అర్జీలు

ప్రజాశక్తి-రంపచోడవరం

స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 75 అర్జీలు అందాయి. ఏజెన్సీలోని ఏడు మండలాల నుండి వివిధ సమస్యలపై సమర్పించిన అర్జీలను ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ స్వీకరించారు. ఆ అర్జీల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాలని జిఒ 3ను పునరుద్ధరించాలని, షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం తేవాలని తదితర డిమాండ్లతో ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ ఆధ్వర్యాన ఐటిడిఎ పిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్‌రాజ్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, డిఎల్‌పిఒ రఘునందన్, వెలుగు ఏపిడి దేగలయ్య, డీఈవో వై.మల్లేశ్వరరావు, డాక్టర్ వెంకట ఇందిరా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, రవికుమార్, సుబ్బయ్య, తహశీల్దారు ఏఎస్వి సత్యనారాయణ, ఎంపీడీవో జయంతి, సిడిపిఒ సంధ్యారాణి, డిప్యూటీ తహశీల్దార్లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలతో గంజాయి నిర్మూలన

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్


మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: ప్రత్యామ్నాయ పంటల సాగుతోనే గంజాయిని నిర్మూలించవచ్చునని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ స్పష్టం చేసారు. గంజాయి సాగుతో సమాజానికి కలిగే చేటుపై గిరిజనులను చైతన్యవంతం చేయాలని సూచించారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యానవన, ఐసిడిఎస్, విద్యా, పోలీస్, డి.ఆర్.డి.ఏ, వైద్య ఆరోగ్య, అటవీ శాఖ అధికారులతో గంజాయి నిర్మూలన, ప్రత్యామ్నాయ పంటలపై సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గంజాయి నిర్మూలనపై గత నెలలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమాలపై అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో గంజాయి వినియో గంతో కలిగే నష్టాలపై అవగాహనా సదస్సులు నిర్వహించాలని సూచించారు. కళాశాలల్లో అవగాహనా సదస్సులు, డి ఎడిక్షన్ సెంటరుకు ఎంత మంది వచ్చారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రాలు, మహిళా స్వయం సహాయ సంఘాల సమావేశాల్లో గంజాయి సాగు నిర్మూలనపై చర్చించాలని సూచించారు. గంజాయి సాగు వినియోగం, అక్రమ రవాణాపై 9381123100 ఫోన్ నంబరుకు ప్రజలు సమాచారం అందించాలని చెప్పారు.

జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ మాట్లాడుతూ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 2241 మంది రైతులకు 400 టన్నుల రాజ్మా విత్తనాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. యువత గంజాయి వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో 153 గ్రామాల్లో గంజాయి సాగు పై సర్వే చేయడం జరిగిందన్నారు. వివిద ప్రభుత్వ శాఖల్లో 34 ఫిర్యాదు పెట్టెలను ఏర్పాటు చేసామన్నారు. జిల్లా సరిహద్దులో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. గంజాయి సాగు విడిచి పెట్టిన రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, స్వయం ఉపాధి పథకాలు, బ్యాంకు రుణాలు, పశువులు, మేకలను మంజూరు చేయాలని స్పష్టం చేసారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ్, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్ కుమార్‌రావు, గిరిజన సంక్షేమ శాఖ ఇన్చార్జి ఉపసంచాలకులు ఎల్. రజని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ భాషా, పిడిలు మురళి, సూర్యలక్ష్మి పాల్గొన్నారు.

సిపిఎం మండల కార్యదర్శిగా ధర్మన్నపడాల్




ప్రజాశక్తి -జి.మాడుగుల: సిపిఎం మండల కార్యదర్శిగా సాగిన ధర్మన్నపడాల్ ఎన్నికయ్యారు. సిపిఎం మండల మహాసభ గెమ్మెలి పంచాయతీ మహాదేవపురంలో జరిగింది. ఈ సందర్భంగా మండల కమిటీ సభ్యులుగా దీనబంధు, కటారి కోటేశ్వరరావు, పలాసి సంకయ్య, ఈశ్వరమ్మ ఎన్నికయ్యారు. పంచాయతీ గ్రామాలలో సమస్యలపై ఉద్యమిస్తామని ధర్మన్నపడాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వనుగు సన్యాసిదోర, బాణం ధర్మారావు, మంజరి పినంనాయుడు, సలుగు సత్తిబాబు, గణపతి, బాలయ్య. పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న వైస్ ఎంపిపి, గ్రామస్తులు

తాగునీటి బోరుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: మండలంలోని కించాయి పుట్టు పంచాయితీ పెద్దపుట్టు గ్రామంలో తాగునీటి బోరు నిర్మాణానికి సోమవారం మండల వైస్ ఎంపీపీ సత్యనారాయణ భూమి పూజలు చేసి పనులు ప్రారంభించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత సర్వసభ్య సమావేశంలో తాగునీటి సమస్యపై ప్రస్తావించగా ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర స్పందించి జెడ్పీ నిధులు కేటాయించారన్నారు. పెద్దపుట్టు గ్రామంలో సుమారు 50 కుటుంబాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.


జాతీయ పోటీలకు ఎంపికైన సంతోష్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

జాతీయస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-రంపచోడవరం

జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు ఎపిటిడబ్ల్యు రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాల ప్రథమ సంవత్సరం బైపిసి చదువుతున్న తునికి సంతోష్ ఎంపికయ్యాడు. ఈనెల 25, 26. తేదీలలో కర్నూలు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి లాంగ్ పోటీల్లో సంతోష్ ద్వితీయ స్థానం సాధించి త్వరలో బీహార్ రాష్ట్రంలో జరగబోయే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ఇ.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు సోమవారం సంతోష్‌ను, ఫిజికల్ డైరెక్టర్ జి.లోవరాజును ప్రిన్సిపల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ కాంతి రోజ్, కెమిస్ట్రీ లెక్చరర్ కె.పాండురంగారావు, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ కుమార్

కార్యదర్శులు బాధ్యతగా పని చేయాలి

ప్రజాశక్తి- అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు, సచివాలయం సిబ్బంది సమయపాలన పాటింపు వంటి వాటిపై సచివాలయాల సెక్రటరీలు బాధ్యతగా పని చేయాలని ఎంపీడీవో ఏవివి కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శెట్టి నీలవేణి ఆధ్వర్యన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది సకాలంలో హాజరు కావాలన్నారు. ప్రజలకు అందుబాటులో లేని సిబ్బందిపై చర్యలు తీసుకోక తప్పదని స్పష్టం చేశారు. గ్రామాలలో మంజూరైన నిధులతో పనులు పూర్తి చేసి అభివృద్ధికి సహకరించాలన్నారు. ఇంద్రమ్మ గృహాలు కట్టుకొని బిల్లులు కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదార్లను గుర్తించాలని, దీనిపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు.


మాట్లాడుతున్న విఒఎలు

విఒఎల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి-హుకుంపేట: వెలుగు విఓఏల కాలపరిమితి సర్క్యులర్ను రద్దు చేయాలని ఆ సంఘం జిల్లా కోశాధికారి పలాసి పోతురాజు నాయుడు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి మీడియాతో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రికి, మంత్రికి యూనియన్ నాయకులు అనేక పర్యాయాలు ఈ అంశంపై వినతిపత్రాలు అందించారన్నారు. ఇందుకు విరుద్ధంగా మంత్రి వ్యాఖ్యలు ఉండటంతో రాష్ట్ర వ్యాప్తంగా విఒఎలు ఆందోళన చెందుతున్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలో విఒఎలపై రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు పెరిగాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వేలాది మందిని తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వం చట్ట విరుద్ధంగా కాలపరిమితి సర్క్యులర్ తీసుకొచ్చిందని తెలిపారు. దీనిపై గతంలో పోరాటాలు చేశామని, ఈ పోరాటాల్లో పాల్గొన్న చంద్రబాబు, లోకేష్ సర్క్యులర్ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు వివో ఏల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిఒ 3 పునరుద్ధరణ తరువాతే

మెగా డిఎస్‌సి ప్రకటించాలి

- ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్
- తహశీల్దారు కార్యాలయం ఎదుట ఆదివాసీ నిరుద్యోగ జెఎసి ధర్నా


తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న నిరుద్యోగులు, గిరిజన సంఘం నేత పులి సంతోష్‌కుమార్

ప్రజాశక్తి-విఆర్.పురం

ఎన్నికల సందర్భంగా చంద్రబాబునాయుడు అరకు బహిరంగ సభలో ఇచ్చిన హామీ ప్రకారం జీవో నెంబర్ 3ని పునరుద్ధరణ చేసి చట్టబద్ధత కల్పించాలని, ఆ తరువాతే మెగా డిఎస్‌పి నోటిఫికేషన్ విడుదల చేయాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 3 పునరుద్ధరణ, ఏజెన్సీ ప్రత్యేక డిఎస్‌సి, మెగా డిఎస్‌సిలో ఏజెన్సీ పోస్టులపై స్పష్టత ఇవ్వాలని కోరుతూ మండలంలోని రేఖపల్లి తహశీల్దారు కార్యాలయం ముందు సోమవారం ఆదివాసీ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దారు సరస్వతికి సమర్పించారు. ఈ ధర్నాకు సంతోష్ కుమార్‌తో పాటు ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు పాయం లక్ష్మణరావు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో చదువుకుంటున్న యువతీ యువకులకు జీవో నెంబర్ 3 ఒక వరం లాంటిదని, దానిని సుప్రీంకోర్టు 2020లో రద్దు చేసి ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేసిందని పేర్కొన్నారు. ఈ జిఒ 3ను పునరుద్ధరిస్తామని అరకు ఎన్నికల బహిరంగ సభలో చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. జిఒ 3 పునరుద్ధరణ చేయకుండా మెగా డిఎస్‌పి నోటిఫికేషన్ విడుదల చేస్తే ఆదివాసీ యువతీ యువకులకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. ఆదివాసీ నిరుద్యోగుల పట్ల ప్రేమ ఉంటే తక్షణమే జీవో నెంబర్ 3ని పునరుద్ధరణ చేసి ఏజెన్సీ ప్రాంతంలో 100 శాతం ఉద్యోగాలను ఆదివాసీ నిరుద్యోగులతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు పాయం. లక్ష్మణరావు మాట్లాడుతూ మెగా డిఎస్‌సిలో ఏజెన్సీ ప్రాంతంలోని ఇడబ్ల్యుఎస్‌కి 10 శాతం రిజర్వేషన్లు కల్పించి గిరిజనులకు 6శాతం మాత్రమే ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆదివాసీ నిరుద్యోగి సోడే చందు మాట్లాడుతూ జీవో నెంబర్ 3 పునరుద్ధరణ కోసం ఈ నెల 30న చింతూరు ఐటీడీఏ కార్యాలయం ముందు జరుగు ధర్నాకు ఆదివాసీ నిరుద్యోగులు, ప్రజాసంఘాలు, పలు పార్టీల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నిరుద్యోగులు పులి అశోక్, ముత్యాల రెడ్డి, గౌతమ్, విశ్వంత్, దుర్గాప్రసాద్, చంటి, కవిత, లక్ష్మి, చిట్టి, వెంకట్, జై రాజు, కరుణ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలోనే ప్రసవం పొందాలి

ప్రజాశక్తి -సీలేరు

గర్భిణులు ఆసుపత్రిలోనే ప్రసవం పొందాలని దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డీకే హిమబిందు అన్నారు. పిహెచ్‌సిలో పరిధిలోని గుమ్మిరేవుల పంచాయతీ అన్నవరం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్యాధికారి, వైద్య సిబ్బంది కొంత దూరం వరకు అంబులెన్స్‌లో వెళ్లి అక్కడి నుంచి రెండు కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించి అన్నవరం గ్రామానికి చేరుకున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో 84 మంది గిరిజనులకు సాధారణ ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణులు క్రమంగా ఆరోగ్య తనిఖీలు చేయించుకోవాలని సూచించారు. తొమ్మిది నెలల్లో కనీసం ఒకసారైనా అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేయించుకోవాలన్నారు. స్కానింగ్ వల్ల ప్రమాదకర మైన పసవాలను ముందుగానే గుర్తించవచ్చునని, శిశువు ఎదుగుదలను పరిశీలించవచ్చునని ఆమె తెలిపారు. గర్భిణులు ప్రసవ సమయానికి 10 రోజులు ముందుగా ఆసుపత్రిలో చేరాలన్నారు. ఆసుపత్రిలో ప్రసవం పొందడం వల్ల తల్లి బిడ్డ ఆరోగ్యం సురక్షితమని పేర్కొన్నారు. చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ఆసుపత్రికి తీసుకుని వచ్చి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. గిరిజనులు నాటు వైద్యం, పసర మందులకు దూరంగా ఉండాలని డాక్టర్ హిమబిందు సూచించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌ఎన్ రాణి, ఎంఎల్ హెచ్ పి లోవకుమారి, ఏఎన్ఎంలు మత్స్యకొండ, సీత పాల్గొన్నారు.


ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ హిమబిందు


చిన్నారుల గణన చేస్తున్న సిబ్బంది

చిన్నారుల గణన

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరు పిహెచ్సి పరిధి గ్రామాల్లో ఐదేళ్ల లోపు చిన్నారుల గణన నిర్వహిస్తున్నామని సబ్ యూనిట్ అధికారి ఆర్.కన్నబాబు తెలిపారు. హెడ్ కౌంట్ సర్వేను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన నాటి నుండి చిన్నారులకు ప్రాణాంతక వ్యాధులకు అందించే డోసు వివరాలు, డోసు అందని పిల్లల వివరాలు సర్వేలో గుర్తించడం జరిగిందన్నారు. డోసులు పూర్తిగా పడినవారికి డ్రాప్ అవుట్‌లో ఉన్న చిన్నారులకు టీకాలు వేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. వ్యాధి నిరోధక టీకాలు 100 శాతాన్ని అధిగమించడానికి ఈ సర్వే దోహదపడుతుందన్నారు. మలేరియా, డెంగీ కేసులు ఫాలో అప్ సర్వే నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో దోమల పిచికారీ చేశారా? లేదా? ఆరా తీశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కె.జోజిబాబు ఆరోగ్య పర్యవేక్షకులు ఎన్.త్రినాథ, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న నాయకులు

చట్టాలు అమలుచేయాలని ర్యాలీ

ప్రజాశక్తి -పాడేరు: ఆదివాసిల జీవనోపాది పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన చట్టాలు క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆదివాసీ మహాసభ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పాడేరు పాతబస్టాండ్ నుండి ఐటీడీఏ కార్యాలయం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ మహాసభ అధ్యక్షురాలు మర్రి మాధురి మాట్లాడుతూ, గిరిపుత్రుల జీవనోపాధిని పెంచి, రక్షణ కల్పించేందుకు అటవీహక్కులు, పెసా చట్టాల్ని అమల్లోకి తెచ్చిందన్నారు. ఈ చట్టాలన్నీ క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐ.టి.డి.ఏ. కార్యాలయం అధికారులకు వినతి పత్రాన్ని అందించారు. ఈ అదివాసి మిత్ర సిఈఓ మన్మధరావు, గ్రామమిత్రలు, పెసా కమిటీ సభ్యులు, అటవీ హక్కుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

ఉపాధ్యాయునిపై డిఇఒకు ఫిర్యాదు

ప్రజాశక్తి-పాడేరు: మండలంలోని వంట్లమామిడి పంచాయతీ జోడూరు గ్రామానికి ఉపాధ్యాయుడు రాలేదని, తగు చర్యలు తీసుకోవాలని ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు జిల్లా విద్యాశాఖ అధికారికి, మండల విద్యాశాఖ అధికారిలకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు మాట్లాడుతూ, జోడూరు గ్రామానికి నియమించిన ఉపాధ్యాయుడు గ్రామస్తులతో దురుసుగా మాట్లాడి మీ గ్రామానికి తాను వచ్చి విద్య బోధించనని చెప్పున్నారని, దానిపై విచారణ జరిపించాలన్నారు. జోడూరు గ్రామానికి ఉపాధ్యాయుడిని పంపించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు పాలికి లక్కు డిమాండ్ చేశారు. జోడూరు గ్రామంలో 28 మంది పిల్లలు ఉండటంతో కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాల మంజూరు చేశారని చెప్పారు. ఉపాధ్యాయుడిని నియమిస్తూ 17.10.2024 ఉత్తర్వులు ఇచ్చారని, రోజులు అయినా జోడూరు గ్రామానికి ఉపాధ్యాయుడు రాలేదన్నారు. విద్యాశాఖ అధికారులు తగు చర్యలు తీసుకొని ఉపాధ్యాయుడిని తక్షణమే నియమించి పాఠశాల తరగతులను ప్రారంభిం చాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో జోడూరు గ్రామస్తులు బాబురావు, రాజు, రవికుమార్, కోమటిరావు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి-సీతమ్మధార : నర్సింహనగర్‌లోని అమెరికన్ బార్‌లో వెయిటర్‌గా పనిచేస్తున్న బంగారునాయుడు మద్యాన్ని అధిక ధరలు విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు పోలీసులు అతని నుంచి 78 సీసాల మందును స్వాధీనం చేసుకున్నట్లు నాలుగో పట్టణ సిఐ ఎస్.విజయకుమార్ తెలిపారు. బంగారునాయుడును అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.

సెల్ టవర్లు, ఫైబర్‌లైన్లకు అనుమతులు

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు : జిల్లాలో నిర్మించనున్న పలు సెల్ టవర్లకు, ఆప్టికల్ ఫైబర్ లైన్లకు అటవీ, రెవిన్యూ అనుమతులు మంజూరు చేస్తూ జిల్లా స్థాయి కమిటీ ఆమోదం తెలిపింది. సోమవారం జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు ప్రతిపాదనలపై చర్చించిన కమిటీ అభ్యంతరాలు లేని ప్రాంతాలకు ఆమోదం తెలిపింది. అందులో భాగంగా పెదబయలు మండలం ఎగువ బందపల్లి, డుంబ్రిగుడ మండలం నారింజవలసలో జియో టవర్ల నిర్మాణానికి, అదేవిధంగా గుడిసె లో సెల్ టవర్ నిర్మాణానికి ఆమోదం తెలిపారు. అరకు, పెదబయలు, డుంబ్రిగుడ మండలాలలో బహుళ రహదారులలో ఆప్టికల్ ఫైబర్ లైన్ల నిర్మాణానికి ఆమోదించారు. రంపచోడవారంలో ప్రతిపాదించిన ఏడూ రోడ్లకు పాడేరులో ప్రతిపాదించిన రెండు రోడ్లకు, హుకుంపేటలో ఎనిమిది రోడ్లకు త్వరితగతిన జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి ఫారం ఎ, బిలు తదుపరి నవంబర్ 15న జరుగనున్న డిఎల్ సి సమావేశానికి సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అడ్డతీగల, మారేడుమిల్లిలో జియో టవర్ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అవసరమైన తీర్మానాలపై అటవీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎంజే అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డిఆర్ఓ బి. పద్మావతి, గిరిజన సంక్షేమ, ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యు ఎస్ కార్యనిర్వహక ఇంజినీర్లు వేణుగోపాల్, బాలసుందర బాబు, జవహర్ కుమార్, ఆన్లైన్‌లో రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ, రంపచోడవరం, పాడేరు, చింతపల్లి డిఎఫ్‌ఓలు, ఎయిర్ టెల్, బీఎస్ఎన్ఎల్, జియో సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు

పోటీల్లో అధికారులు పాల్గొవాలి

ఈ నెల 29,30 తేదీలలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ పోటీలకు ఎంపిక ప్రక్రియ జరుగుతుందని, జిల్లాలో గల అధికారులు, సిబ్బంది పెద్ద స్థాయిలో పాల్గొవాలని జిల్లా క్రీడా ప్రాదికారిక సంస్థ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారు నవంబర్ 06 నుండి 11 వరకు విజయవాడలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.రాష్ట్ర క్రీడా ప్రాదికారిక సంస్థ నిర్ణయించిన 18 క్రీడాంశాలలో పోటీలు జరుగుతాయన్నారు. ఈ నెల 29న స్థానిక తలారిసింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో అథ్లెటిక్స్, బాడ్మింటన్, క్యారమ్స్, చెస్, వాలీబాల్, లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్, రెజలింగ్, పవర్ అండ్ వెయిట్ లిఫ్టింగ్, ఖోఖో, బెస్ట్ ఫిజిక్ అంశాలలో పోటీలు జరుగుతాయని తెలిపారు. 30 వ తేదీన అనకాపల్లి డావిన్సి పాఠశాలలో స్విమ్మింగ్ పోటీలు జరుగుతాయన్నారు. స్థానిక తలారిసింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఫుట్ బాల్, బాస్కెట్ బాల్, క్రికెట్, కబడ్డి, హాకీ, యోగా పోటీలు జరుగుతాయని కలెక్టర్ వివరించారు. క్రీడలలో పాల్గొనేవారు ఆయా శాఖలు జారీ చేసిన గుర్తింపు కార్డుతో పాటు ఆదార్ కార్డుల జిరాక్స్‌లతో హాజరు కావాలని కలెక్టర్ సూచించారు. పూర్తి వివరాలకు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎ జగన్మోహనరావు ఫోన్: 9000274225 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సన్నిబాబు

వాలంటీర్లకు బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-పెదబయలు: వాలంటీర్లకు బకాయి వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సన్నిబాబు డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల వాలంటీర్లతో సోమవారం గిరిజన ఉద్యోగుల సంఘ భవనంలో గెమ్మిలి కొండబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన సన్నిబాబు మాట్లాడుతూ, గత వైసిపి ప్రభుత్వం గ్రామస్థాయిలో వాలంటీర్లను ఎంపిక చేసి నెలకు రూ.5000 గౌరవ వేతనం ఇస్తూ కొనసాగించారన్నారు. ఎన్నికల సమయంలో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే వాలంటీర్లకు రూ.10వేల వేతనం ఇస్తానని చెప్పి నేటికీ అమలు చేయలేదన్నారు.ఇప్పటికైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వాలంటీర్లకు బకాయి పడ్డ ఐదు నెలల వేతనాలు మంజూరు చేసి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నెలకు పదివేల రూపాయల గౌరవ వేతనం చెల్లించాలని డిమాండ్ చేసారు. ,లేకుంటే గ్రామస్థాయిలో వాలంటీర్లను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. బలవంతంగా రాజీనామా చేసిన వాలీంటీర్లను కొనసాగించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగని, ధర్మాన పడాల్ మాట్లాడుతూ, వాలంటీర్ల ఉద్యమానికి ఆదివాసి గిరిజన సంఘం సంపూర్ణంగా మద్దతు ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, ప్రసాదు, కొండబాబు, ఆదివాసీ గిరిజన సంఘం పెదబయలు మండల అధ్యక్షులు బోండా గంగాధరం, వాలంటీర్లు భారీ ఎత్తున పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు లైసెన్స్ తప్పనిసరి

ఎస్ఐ వెంకటేశ్వరరావు



ప్రజాశక్తి- చింతపల్లి: లైసెన్స్ ఉన్న వ్యాపారస్తులు మాత్రమే బాణాసంచా అమ్మాలని చింతపల్లి ఎస్ఐ వెంకటేశ్వరరావు అన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి బాణాసంచా విక్రయాలు చేయాలని సూచించారు.ప్రభుత్వ ఆదేశాలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

మోదమాంబ ఆలయంలో చోరీ

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం విజయ రామరాజుపేట మోదమాంబ ఆలయంలో హుండీ, అమ్మవారి వెండి, బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుడిలోకి చొరబడి హుండీని పగలగొట్టి నగదు ఎత్తుకెళ్లిపోయారు. సోమవారం ఉదయం భక్తులు గుడికి వెళ్లేసరికి గర్భగుడి తలుపులు తెరుచుకుని ఉన్నాయి. ఈ చోరీపై గ్రామ పెద్దలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎఎస్ఐ ఎన్ భాస్కర్ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.

ఎపిఎస్ఇఎస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నూతన కార్యవర్గ సభ్యులను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఆవరణలో సోమవారం ఎన్నుకున్నారు. విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ప్రత్యేక అతిథిగాను, ఎలక్షన్ అధికారిగా శ్రీకాకుళం ఎపిఎస్ఇఎస్ అసోసియేషన్ అధ్యక్షులు కె.రంగాచారి, ఎలక్షన్ ఆఫీసర్‌గా కె.ముత్యాలరావు, అబ్జర్వర్‌గా బి.శ్రీనివాసరావు వ్యవహరించారు. ఎపిఎస్ఇఎస్ ఉమ్మడి విశాఖ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులుగా పి.ఆనందరెడ్డి, అసోసియేట్ అధ్యక్షునిగా కె.చంద్రధరరావు, సెక్రటరీగా కె.శ్రీనివాసనాయుడు, ఉపాధ్యక్షులుగా బి.బంగారమ్మ, వి.పెంటారావు, జి.జోత్స్న అంబికాదేవి, ఎన్.మంగమ్మ, ఎం.శైలజ కుమారి, జనరల్ సెక్రటరీగా రామలింగేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.సుందర్‌సింగ్ ఎన్నికయ్యారు.

సురక్షితంగా దీపావళి జరుపుకోవాలి

డాక్టర్ శిల్పా తారిణి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆనందదాయకమైన దీపావళిని సురక్షితంగా జరుపుకోవాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్రవర్తించాలని ఎల్‌వి.ప్రసాద్ కంటి వైద్య నిపుణులు డాక్టర్ శిల్పా తారిణి తెలిపారు. దీపావళి రోజున మందుగుండు సామగ్రిని కాల్చే సమయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఒక వేళ ప్రమాదాలు జరిగితే వైద్య నిపుణుల సంప్రదించడం వంటి విషయాలను వివరించారు. పండగ సమయంలో కాలిన గాయాల కేసులు పెరుగుతున్నాయన్నారు. జాగ్రత్తలు పాటించడం ద్వారా నివారించవచ్చని చెప్పారు. చిన్న పిల్లలను టపాసులతో ఒంటరిగా వదిలి పెట్టకూడదని, సింథటిక్ కంటే కాటన్ దుస్తులు ధరిస్తే మంచిదని, టపాసులు కాల్చడానికి బహిరంగ ప్రదేశాలను ఎంచుకోవడం ఉత్తమం అని వివరించారు. కంటికి ఏమైనా గాయమైతే వెంటనే సంబంధిత వైద్యనిపుణులను సంప్రదించాలని సూచించారు. టపాసులు కాల్చే సమయంలో దగ్గరలో రెండు బక్కెట్ల నీరు ఉంచుకోవడం మంచిదన్నారు. చేతితో టపాకాయలను వెలిగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఒకవేళ కంటికి గాయమైతే కంటిమీద ఎటువంటి ఒత్తిడి పెట్టకూడదని, దాన్ని ముట్టుకోవడం, నలపడం చేయకూడదని వివరించారు.

విశాఖ డెయిరీ ఆక్రమించిన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ డెయిరీ యాజమాన్యం ఆక్రమించిన మూడెకరాల బంజరు భూమిని స్వాధీనం చేసుకోవాలని సోమవారం స్పందనలో జిల్లా కలెక్టర్‌కు సిపిఎం నాయకులు ఎ.లోకేశ్వరరావు, వనమాల అప్పలరాజు, వైసిపి నాయకులు వరదాడ వెంకటరమణ, గ్రామ పెద్దలు ఎస్.అప్పలరాజు కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సంత స్థలాన్ని స్వాధీనం చేసుకుని ఆటస్థలంగా అభివృద్ధి చేయాలని కోరారు. గాజువాక మండలం, 68వ వార్డు పరిధి మింది రెవెన్యూ తాలూకా అక్కిరెడ్డిపాలెం శివారు సర్వే నంబర్ 47/3 ఉన్న మూడెకరాల బంజరు సంత స్థలాన్ని విశాఖ డెయిరీ యాజమాన్యం ఆక్రమించి ప్రహరీ నిర్మించిందని వివరించారు. ఈ స్థలం విషయమై గతంలో పోరాటం చేసామని తెలిపారు. ఇప్పటికే విశాఖ డెయిరీ వల్ల జల, వాయు కాలుష్యం తప్ప తమ గ్రామ అభివృద్ధికి ఏ విధమైన సహకారమూ లేదని పేర్కొన్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అభివద్ధికి విజన్ 2027, వికసిత్ భారత్ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. రోడ్లు, ఇసుక, ఇళ్ల నిర్మాణాలు, సిఎస్ఆర్ నిధులపై చర్చించారు. జిల్లాలో ఇసుక డిపో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. శాసనసభ స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ అన్‌రాక్ అల్యూమినియం ఫ్యాక్టరీ ఒప్పందాలు అమలుచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనకాపల్లి ఎంపీ సిఎం.రమేష్ మాట్లాడుతూ జిల్లాలో స్టీల్ ప్లాంట్, లాజిస్టిక్ హబ్ ఏర్పాటు చేయాలన్నారు. హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో సెక్రటరీ, విలేజ్ రెవిన్యూ అధికారుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్‌పి తుహిన్ సిన్హా, ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, దువ్వారపు రామారావు, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్‌బాబు, కెఎస్ఎన్.రాజు, సుందరపు విజయకుమార్, బండారు సత్యనారాయణమూర్తి, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగు కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, డిఆర్ఒ బి.దయానిధి, ఆర్‌డిఒలు షేక్ ఆయిషా, వి.వి.రమణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రచ్చబండ నిర్మాణం పూర్తి

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు మేజరు పంచాయతీ పరిధి చింతపల్లి క్యాంపులో నూతనంగా రచ్చబండ, షెడ్డు నిర్మాణాలు పూర్తయినట్లు సీలేరు సర్పంచ్ దుర్జో వెల్లడించారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ చింతపల్లి క్యాంపు గ్రామంలో రచ్చబండ లేక గిరిజనలు తమ సమస్యలను చర్చించడానికి పలు ఇబ్బందులు గురయ్యారని పేర్కొన్నారు. రచ్చబండ వద్ద కూర్చుని ఐక్యంగా సమస్యను పరిష్కరించుకోవడానికి దోహదపడుతుందని తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో నూతనంగా రచ్చబండ షెడ్డు నిర్మించడం జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనం ప్రకారం ముందుగానే రచ్చబండను ప్రారంభించామని నిర్మాణ పనులు పూర్తి కావడంతో సోమవారం వినియోగంలోకి తీసుకొచ్చామని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కె.వల్లి ప్రసాద్, మాజీ ఉపసర్పంచ్ కారే శ్రీనివాస్, సచివాలయం మహిళా పోలీస్ రేవతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నోటీసు బోర్డులో గెస్ట్ టీచర్ల జాబితా

ప్రజాశక్తి-రంపచోడవరం : అల్లూరి జిల్లా రంపచోడవరం, చింతూరు ఐటిడిఎల పరిధిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గెస్ట్ టీచర్ల నియామకానికి సంబంధించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల అర్హత వివరాలను రంపచోడవరం ఐటిడిఎ నోటీసు బోర్డులో ప్రదర్శించినట్లు ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాటిలో ఏమైనా అభ్యంతరాలు, ఫిర్యాదులు వుంటే ఈ నెల 31 గురువారం సాయంత్రం లోపు రంపచోడవరం ఐటిడిఎ గురుకులం సెల్‌లో తెలియజేయాలని కోరారు. అనంతరం అభ్యర్థులకు ఆయా సబ్జెక్టులలో ఇంటర్వ్యూలు, డెమోలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నవంబర్ 1న రంపచోడవరం గురుకుల బాలుర పాఠశాలలో డెమోలు, 2వ తేదీన ఐటిడిఎ సమావేశ మందిరంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటర్వ్యూ, డెమోలకు హాజరయ్యే అభ్యర్థులు కచ్చితంగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకొని రావాలని కోరారు.

నేడు పాల రైతుల మహాధర్నా

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

సొమ్ము దుర్వినియోగంపై ఆగ్రహం
విశాఖ డెయిరీ యాజమాన్యంపై విచారణ జరపాలని, పాల ధర పునరుద్ధరించాలని డిమాండ్

విశాఖ డెయిరీ యాజమాన్యం అవినీతి, రైతుల ఆవు పాల ధర తగ్గింపుపై ఉత్తరాంధ్ర జిల్లాల పాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే పాల ధరను యథాతథంగా పునరుద్ధరించాలని, పశువుల దాణా ధర తగ్గించాలని, అవినీతిపై విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకొని డెయిరీ ఆస్తులను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ పాల రైతుల సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పాల రైతులు మంగళవారం ఉదయం 11 గంటలకు విశాఖ నగరంలోని విశాఖ డెయిరీ ప్రధాన కార్యాలయం వద్ద మహా ధర్నా చేయనున్నారు. కొద్ది రోజుల క్రితం ఆవు పాల ధరను మూడు రూపాయలమేర డెయిరీ తగ్గించడంతో కోట్లాది రూపాయలు యాజమాన్యానికి ఆదా కానుంది. వినియోగదారులకు అమ్ముతున్న పాల ధరలు, రైతుకు విక్రయిస్తున్న దాణా ధరలను భారీగా పెంచుతున్నప్పటికీ అవినీతి మూలంగా డెయిరీ నష్టాల పాలవుతుందన్న ఆరోపణలు ఎంతో కాలం నుంచి ఉన్నాయి. 2018లో జరిగిన సాధారణ సమావేశంలో రూ.250 కోట్ల మూల ధనం ఉన్నట్లు చూపిన యాజమాన్యం ఆ డబ్బు ఏమైందన్న దానిపై నోరు విప్పడంలేదు. రైతుకు డివిడెండ్ ఇవ్వలేదు. బోనస్ బకాయి చెల్లించలేదు. డెయిరీకి పాలుపోయని కొంతమందిని దీర్ఘకాలికంగా డైరెక్టర్లుగా కొనసాగించడం వంటి తప్పుడు పద్ధతులను యాజమాన్యం కొనసాగిస్తోంది. కొంతమంది విశ్రాంత ఉద్యోగులకు లక్షల రూపాయలు చెల్లించి డెయిరీ డబ్బులను దుర్వినియోగం చేస్తోంది.

ఈ నేపథ్యంలో విశాఖ డెయిరీ పరిరక్షణ కోసం రైతులు మంగళవారం ధర్నా చేపట్టనున్నారు. పాల రైతుల సొమ్మును ఇష్టానుసారం దుర్వినియోగం చేస్తున్న యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. పాల ధరను పునరుద్ధరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కంటకాపల్లి రైలు ప్రమాదానికి ఏడాది !

నాడు ఇద్దరు లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్ సహా 17 మంది మృతి
ఘటన కారణాలపై రైల్వే సేఫ్టీ కమిషన్ విచారణ - నేటికీ పూర్తి నివేదిక గోప్యమే..

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ - విజయనగరం జిల్లా సరిహద్దుల్లోగల 'అలమండ-కంటకాపల్లి' వద్ద 2023 అక్టోబర్ 29 సాయంత్రం 7 గంటలకు జరిగిన రైలు ప్రమాదం ఇప్పటికీ కళ్లముందు కదలాడుతూనే ఉంది. సరిగ్గా ఏడాది క్రితం జరిగిన ఈ దుర్ఘటన ఈ ప్రాంత రైలు ప్రమాదాల్లో అత్యంత విషాదకరమైనది. ఆ ఘటనతో ప్రజలంతా ఒక్కసారిగా తీవ్ర ఆందోళన చెందారు. ఈ ప్రమాదంలో ఇద్దరు లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్ (గార్డు)తో పాటు 14 మంది ప్రయాణికులు మృతిచెందిన విషయం తెలిసిందే. వాల్తేరు రైల్వేలో జరిగిన ఈ ప్రమాదంలో 50 మంది ప్రయాణికులు గాయాలతో బయటపడ్డారు. ప్రమాదంపై అప్పట్లో విచారణ సాగినప్పటికీ నేటికీ పూర్తి నివేదిక బహిర్గతం కాలేదు.


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన రైలు బోగీలు (ఫైల్ ఫొటో)

ఆ రోజు ఏం జరిగింది ?

విశాఖ నుంచి పలాస వెళ్తున్న ప్రత్యేక పాసింజరు రైలు కొత్తవలస మండలం అలమండ - కంటకాపల్లి వద్ద సిగ్నల్ కోసం పట్టాలపై సాయంత్రం 7 గంటల సమయంలో ఆగింది. వెనకాలే వస్తున్న విశాఖ - రాయగడ రైలు దాన్ని ఢీకొట్టింది. ఈ రైళ్లలో అత్యధికంగా ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన కూలీలు, కార్మికులే ఉన్నారు. ప్రమాదంలో మొత్తం 5 బోగీలు పట్టాలు తప్పాయి. 17 మంది కన్నుమూశారు. 50 మంది వరకూ గాయాలపాలయ్యారు.

సేఫ్టీ కమిషన్ విచారణ ఏం తేల్చింది ?

కమిషన్ ఆఫ్ రైల్వే సేఫ్టీ (సిఆర్ఎస్) ఈ రైలు ప్రమాద ఘటనపై విచారణ చేపట్టింది. 10 మంది బృందం ఈ ప్రాంతంలో అప్పట్లో పర్యటించింది. ముఖ్యంగా కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ (నార్త్ ఈస్ట్ సర్కిల్) ప్రంజీవ్ సక్సేనా కొన్ని ప్రాథమిక నిర్ధారణలు చేశారు. ఈ ప్రమాద వైఫల్యాలపై అప్పట్లో స్పందిస్తూ రైల్వే అడ్మినిస్ట్రేషన్ వైఫల్యం దీంట్లో ఉందని, ఘటన జరిగాక నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సెస్ పనితనం నైపుణ్యవంతంగా లేదని ఘాటు వ్యాఖ్య చేశారు. నేరుగా రైల్వే బోర్డు నుంచే వీరు విచ్చేశారు. నివేదిక కూడా అక్కడే సమర్పించారు. కానీ పూర్తి స్థాయిలో బయటపెట్టలేదు. ఆటోమేటిక్ సిగ్నల్‌ను దాటుకుంటూ లోకోమోటివ్ పైలట్ ట్రైన్ నెంబరు 08504 డేంజర్ సిగ్నల్ చూడకుండా వెళ్లిపోయారని నివేదించారు. అసిస్టెంట్ లోకో పైలట్ ట్రైన్ నెంబరు 08504 ఎమర్జెన్సీ బ్రేక్‌లు వేయలేకపోయాడని పేర్కొన్నారు. కానీ దీంట్లో పైలట్ తప్పేలేదని లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ క్లెయిమ్ చేసింది. రైల్వే బోర్డుతోనూ ఈ అంశంపై పోరాడడంతో కమిషన్ నివేదిక తప్పు అని తేలింది. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ స్పందిస్తూ 'ఆరోజు క్రికెట్ మ్యాచ్ జరుగుతుండడంతో పైలట్‌లు ఆ మ్యాచ్ చూసుకుంటూ యాక్సిడెంట్ చేశారు' అని వ్యాఖ్యలు చేయడంపైనా రైల్వే సంఘాలు భగ్గుమన్నాయి.

వాస్తవానికి 'అమృత్ భారత్ పథకం' నిధుల ఖర్చులో రైల్వేల్లో భద్రత, మౌలిక వసతుల కల్పనకు పూర్తిస్థాయిలో వెచ్చించడం లేదన్న విమర్శలు నానాటికీ పెరుగుతున్నాయి. సిగ్నలింగ్ వ్యవస్థలను బలోపేతం చేయడం, ట్రాక్‌లపై రైళ్లకు మధ్య సరైన దూరం ఉండేలా చర్యలు తీసుకోవడం వంటివి ఆచరణలో చేయాల్సి ఉంది.


మాట్లాడుతున్న రాజశేఖర్

అందరికీ మేలు జరిగేలా సాగుదారుల చట్టం - 2024

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పంట సాగుదారుల చట్టం - 2019లో ఉన్న లోపాలను దృష్టిలో పెట్టుకొని దాని స్థానంలో అందరికీ మేలు జరిగేలా సాగుదారుల చట్టం - 2024ను తీసుకురావాలనే ఉద్దేశ్యంతో ఉన్నామని స్టేట్ అగ్రికల్చరల్ అండ్ మార్కెటింగ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ సాగుదారుల చట్టం - 2024పై సోమవారం మధ్యాహ్నం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆరు జిల్లాల వారితో ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. కొత్త సాగుదారుల హక్కు చట్టం - 2024 ఏర్పాటుపై అవగాహన కల్పించి, భూ యజమానులు, కౌలు కౌలు రైతులు, అధికారుల అభిప్రాయాలు సేకరించి చట్టం అమలుకై ఈ సదస్సు చేపట్టినట్టు నిర్వాహకులు తెలిపారు. తొలుత వ్యవసాయ శాఖ సలహాదారులు ఢిల్లీరావు మాట్లాడుతూ సిసిఆర్‌సి చట్టం 2019లో ఉన్న లోపాలను, రాబోయే కాలంలో ఏర్పాటు చేయనున్న నూతన చట్టంలో ఉంచుతున్న అంశాలను తెలియజేశారు. అనంతరం స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ మాట్లాడుతూ సాగుదారులను ప్రోత్సహించాలన్న సంకల్పంతో ఉన్నామన్నారు. కొత్త చట్టం ప్రకారం.. పంట రుణాలను ఎలా ఇవ్వనున్నారో ఆయన తెలిపారు. జూన్ 1 నాటికి కౌలు రైతు కార్డు ఇప్పించేలా చేయడం, పంట రుణాలు అందించేలా చేయడం కొత్త చట్టం ముఖ్య ఉద్దేశమన్నారు. విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఈ సదస్సు ద్వారా సాగుదారులు, భూ యజమానుల చట్టంపై అవగాహన ఏర్పరుచుకుని అందరికీ తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వివిధ జిల్లాలకు చెందిన కౌలు రైతులు, భూ యజమానులు, ఎన్‌జిఒలు, కౌలు రైతుల సంఘాల నాయకులు మాట్లాడుతూ పంట రుణాలు పొందడంలో ఉన్న సమస్యలను వివరించారు. ఆరు జిల్లాల నుండి విచ్చేసిన జిల్లా వ్యవసాయ అధికారులు, ఎడిఎలు, విఆర్‌ఒలు, తహశీల్దార్లు, వ్యవసాయదారులు, బ్యాంక్ అధికారులు, కమర్షియల్ ఆఫ్ అగ్రికల్చర్ అడిషనల్ డైరెక్టర్ శ్రీవర, అగ్రికల్చరల్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.పద్మావతి, అడిషనల్ డైరెక్టర్ ఎం.గోపాల్ పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో చర్చించి నిర్ణయం తీసుకోవాలి
ఎపి రైతు సంఘం నాయకులు గండి నాయనబాబు

కొత్త చట్టంపై గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని ఎపి రైతు సంఘం అనకాపల్లి జిల్లా నాయకులు గండి నాయనబాబు కోరారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ నూతన కౌలు చట్టం తీసుకొస్తున్న సమయంలో కొన్ని సూచనలను తెలియజేశారు. భూయజమాని సంతకం, అంగీకారంతో సబంధం లేకుండా ప్రభుత్వమే కౌలు రైతులను గుర్తించి కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. గ్రామాల్లో దండోరా ద్వారా ప్రచారం చేసి గ్రామ సభలు నిర్వహించి ధరఖాస్తులు తీసుకోవాలన్నారు. భూయజమానులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే అధికారుల సమక్షంలో నివృత్తి చేయాలని కోరారు. గ్రామంలోని కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చిన డేటాను సంబంధిత మండల వ్యవసాయ శాఖ, రెవిన్యూ శాఖ, బ్యాంకులకు పంపాలన్నారు. పంట నమోదు కౌలు గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులతో పాటు భూమి ఆన్‌లైన్లో లేకపోయిన రైతులను గుర్తించి పంట నమోదు చేయాలన్నారు. కౌలు రైతులకు అండగా ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి-ఎటపాక : ఎటువంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎటపాక సిఐ కన్నపరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గుండాల ర్యాంపు నుంచి గొల్లగట్ట మీదుగా ఎటువంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు ఆదివారం రాత్రి వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి మూడు ట్రాక్టర్లను స్వాధీనపర్చుకొని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ మూడు ట్రాక్టర్లను తదుపరి చర్యల నిమిత్తం రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని సిఐ కన్నపరాజు హెచ్చరించారు.